క్లుప్తంగా

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన సర్పంచ్



కిషన్‌రెడ్డిని సన్మానించిన సర్పంచ్ రఘుపతిగౌడ్, బీజేపీ నాయకులు

మహేశ్వరం: కొత్తురుకు జన ఔషధ మెడికల్ షాపును ప్రారంభించడానికి విచ్చేసిన కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని బుధవారం చిన్న తూప్ర గ్రామ సర్పంచ్ కొండ రఘుపతి గౌడ్, బీజేపీ నాయకులు లింగం ముదిరాజ్, పలువురు నాయకులు కలిశారు. చిన్న తూప్ర గ్రామానికి కేంద్ర నిధులు ఇవ్వాలని కిషన్‌రెడ్డిని వారు కోరారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించడం ద్వారా వారిలో మానసిక, శారీరక అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని సీఎస్ఐఆర్ చీఫ్ సైంటిస్ట్ శ్రీధర్ అన్నారు. ఆర్‌కేపురం భాష్యం లిటిల్ చాంప్స్ 12వ వార్షికోత్సవాలను బుధవారం ఆర్‌కేపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ... విద్యార్థులకు విద్యాతో పాటు క్రమశిక్షణ, వినయ విధేయతలు, దేశభక్త నేరి ్పంచి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల సీఈఓ చైతన్య మాట్లాడుతూ... నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని.. వారిని ఉత్తములుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులకు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచుతూ వారికి ఉజ్వల భవిష్యత్తును అందించలన్నారు. పాఠశాల జడ్ఈఓ అంకమ్మరావు మాట్లాడుతూ... భాష్యం విద్యార్థులను అన్ని రంగాలలో సమర్థులుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఆర్‌కేపురం భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్స్ అప్పారావు, రచన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రతి అడుగూ ఉజ్వల భవితవైపు సాగాలి

ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ అనిబిసెంట్ మహిళా డిగ్రీ కాలేజీలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ సాయిశ్రీ, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... విద్యార్థుల్లో కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తి ఉండాలన్నారు. డిజిటల్ మీడియాను సద్వినియోగ పరచుకోవాలని, అనవసర విషయాలతో సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. అన్ని విషయాలూ నిజమని నమ్మరాదని... పరిశీలన చేసి, వేసే ప్రతి అడుగూ ఉజ్వల భవిష్యత్ వైపునకు పడేలా ప్రణాళికాబద్ధంగా సాగాలన్నారు. అన్ని విషయాలు తల్లిదండ్రులతో పంచుకోవడం వలన ఎంతో మేలు జరుగుతుందన్నారు. కాలేజీ సెక్రటరీ డాక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ దయాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వీణారెడ్డి అతిథులను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయండి

కడ్తాల, తలకొండపల్లి నేతలతో రేవంత్‌రెడ్డి



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: పీసీసీ అధ్యక్షుడు ఎనుమల రేవంత్‌రెడ్డిని బుధవారం కడ్తాల, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కడ్తాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి బిక్యానాయక్, గుజ్జల మహేశ్ పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రేవంత్‌రెడ్డి వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేంకటేశ్, శ్రీశైలం, ఆజీం, రవీందర్‌యాదవ్, జనార్దన్‌రెడ్డి, ఆరీఫ్, చెన్నకేశవులు, జహంగీర్‌బాబా, రాంచందర్‌నాయక్, మల్లేశ్‌గౌడ్, ఇమ్రాన్‌బాబా, సత్యం, సేవ్యాబావూజీ, రమేశ్, మహిపాల్‌రెడ్డి, జనార్దన్‌గౌడ్, బాలరాజు, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకాశమే మీ హద్దు



మహేశ్వరం: మహిళలకు కేక్ తినిపిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం మహేశ్వరం నియోజకవర్గంలో ఘనంగా జరుపుకున్నారు. పలుచోట్ల కేక్‌లు కట్‌చేసి సంబురాలు జరుపుకొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన మహిళలు, మహిళా ఉద్యోగులను ఈ సందర్భంగా తోటి ఉద్యోగులు, ప్రజలు సన్మానించారు. ఆయా సన్మాన కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రముఖులు మాట్లాడుతూ.. మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. దేశ ప్రగతిలో మహిళల పాత్ర కీలకమన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఆకాశమే హద్దుగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



కందుకూరు: పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానిస్తున్న పోలీసులు



బాచుపల్లి సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో..



బడంగ్‌పేట్: మహిళా కార్పొరేటర్లను సన్మానిస్తున్న మేయర్ పారిజాత



నేదునూరులో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ రామకృష్ణారెడ్డి



తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయంలో..



కందుకూరు: మహిళలను సన్మానిస్తున్న జెడ్పీటీసీ జంగారెడ్డి, నాయకులు



పహాడీషరీఫ్: పోలీస్ సిబ్బందిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మహేశ్వరం: మహిళా సిబ్బంది, వార్డు సభ్యులను సన్మానిస్తున్న సర్పంచ్ సంధ్య

డాక్టర్స్ కాలనీ మహిళా మండలి కమిటీ

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ మహిళా మండలి నూతన కమిటీని బుధవారం కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా కల్వకుంట్ల మమత, ప్రధాన కార్యదర్శిగా తోడేటి సరిత, కోశాధికారిగా అడ్డు నిత్య, ఉపాధ్యక్షులుగా వక్కలంక అన్నపూర్ణ, కామినేని రామలక్ష్మి, వీరవల్లి జ్యోతి, సంయుక్త కార్యదర్శులుగా పన్నాడి సునీత, తడకల రాధిక, వాణి, కార్యనిర్వాహక కార్యదర్శిగా సుగురు సంధ్య, సభ్యులుగా పద్మ, శిరీష, రమాదేవి, పద్మ, సూర్యకళ, రజినీ, శ్రీలక్ష్మి, వనితా



మమత, అధ్యక్షురాలు

రెడ్డి, రచన, మాధవి, దీప, విజయను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలు మమత మాట్లాడుతూ.. మహిళా సమస్యలపై తమవంతు సహాయ, సహకారాలు అందజేస్తామన్నారు. మహిళా దినోత్సవం రోజు కమిటీని ఎన్నుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. విద్యాశాఖా మంత్రి సహకారంతో సంఘానికి సంబంధించి నూతన భవనం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.

గడువులోగా వాయిదాలు చెల్లించండి

- డీసీసీబీ డీజీఎం ఉదయశ్రీ
- రైతుల ఇంటివద్దకు వెళ్లి రుణాల రికవరీ

యాచారం: దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతుల ఇళ్లకు వెళ్లి బకాయిలు వసూల్ చేయాలని డీసీసీబీ బ్యాంకు డీజీఎం ఉదయశ్రీ పేర్కొన్నారు. యాచారం పీఏసీఎస్‌లో దీర్ఘకాలిక రుణాలు పొందిన చౌదర్‌పల్లి, యాచారం, నందివనపర్తి, నక్కిక్ సింగారం తదితర గ్రామాల్లోని రైతుల ఇంటి వద్దకు బుధవారం ఏజీఎం ఉదయశ్రీ, యాచారం పీఏసీఎస్ సీఈఓ నాగరాజుతో కలిసి వెళ్లారు. మార్చి 30లోపు అప్పు వాయిదాలు చెల్లించాలని కోరారు. ఆయా గ్రామాల్లో పలువురి రైతుల వద్ద నుంచి రూ.20 లక్షలకు పైగా వాయిదా అప్పులు వసూల్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు మార్చి 30లోపు అప్పు వాయిదాలు చెల్లించాలని కోరారు.



చౌదర్‌పల్లిలో రైతువద్ద వాయిదా కట్టించుకుంటున్న ఉదయశ్రీ తదితరులు

యాచారం మండలంలోని పలు గ్రామాల్లో 1,500 మందికి పైగా రైతులు రూ.60 కోట్ల దీర్ఘకాలిక రుణాలు పొందినట్లు తెలిపారు. రైతుల ఇంటి వద్దకే వెళ్తే వసూల్ శాతం పెరుగుతుందని సిబ్బందికి సూచించారు. అవసరమైతే రైతులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు.

ప్రజల సొమ్మును దోచిపెడుతున్న కేంద్రం

డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి

మీర్‌పేట: ప్రజల సొమ్మును ప్రధానమంత్రి మోదీ వ్యాపార వేత్త ఆదానీకి కట్టబెడుతూ దేశాన్ని లూటీ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. ఎస్‌బీఐ, ఎల్ఐసీ సంస్థల్లో ప్రజలు దాచిన లక్షలాది కోట్ల సొమ్మును కేంద్ర ప్రభుత్వం ఆదానీ కంపెనీలో పెట్టుబడులు పెట్టి నష్టపోవడాన్ని నిరసిస్తూ బుధవారం బాలాపూర్ ఎస్‌బీఐ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో బ్యాంకులను జాతీయం చేసి పేద ప్రజలకు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. గతంలో ఆదాని ప్రపంచ ఆదాయంలో 609వ స్థానంలో ఉండగా, బీజేపీ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలోనే 2వ స్థానంలోకి వచ్చారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, ఆదానీకి లాభం చేకూర్చాలన్న ఆలోచన తప్ప అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రధాని ఏనాడూ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే బ్యాంకులు, ఎయిర్ పోర్టులు, ఎల్ఐసీ, రైల్వే, ఐటీని, పోస్టాఫీసులను ప్రైవేటుపరం చేశారన్నారు. ఎల్ఐసీలోని 39 కోట్ల పాలసీదారులకు సంబంధించిన నగదును ఆదానీ కంపెనీలో పెట్టుబడి పెట్టడంతో రూ. 33,060 కోట్లు నష్టపోవడం జరిగిందన్నారు. అదే విధంగా ఎస్‌బీఐ ఇతర బ్యాంకులకు ఆదానీ గ్రూప్ సుమారు 80వేల కోట్ల రుణాలు బకాయి పడిందన్నారు. సామాన్య ప్రజలు పది వేల రుణం చెల్లించకపోతే నానా ఇబ్బందులు పెడతారని, వేల కోట్ల రుణాలు బకాయిపడ్డ బడా వ్యాపార వేత్తలను మాత్రం వదిలేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజల సొమ్మును కాజేసిన ఆదానీని అరెస్ట్ చేసి ఆస్తులను జాతీయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిగురింత నర్సింహారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, ఎల్మెటి అమరేందర్‌రెడ్డి, బంగారు బాబు, రాజ్‌కుమార్, చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, మనోహర్, బాలునాయక్, జైహింద్ తదితరులు పాల్గొన్నారు.



బాలాపూర్ నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా షబ్-ఎ-బరాత్ వేడుకలు

ఆమనగల్లు: ఆమనగల్లు, కడ్తాల మండల కేంద్రాల్లో మంగళవారం షబ్-ఎ-బరాత్ వేడుకలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేడుకలను పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంతో పాటు కడ్తాల మండలం కేంద్రంలోని వివిధ మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి జాగరణ చేసి ఖురాన్ పఠించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని పాడిపంటలు అభివృద్ధి చెందాలని అల్లాను ప్రార్థించారు. ఆయా మసీదు కమిటీల అధ్యక్షులు మాసూం, గౌస్, ఖాదర్, అబ్దుల్ రవూఫ్, అహ్మద్‌జానీ పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత: ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం రూరల్: రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎల్మినేడు గ్రామ రోడ్డు విస్తరణ పనులను బుధవారం ఆర్‌అండ్‌బీ డీఈఈ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఎనిమిది సంవత్సరాల్లో నియోజకవర్గంలోనిరహదారులను రూ.500 కోట్లతో డబుల్‌రోడ్లుగా మార్చాడానికి కృషి చేశామన్నారు . ఇబ్రహీంపట్నం నుంచి ఎల్మినేడు, పోచారం, మంగళపల్లి మీదుగా డబుల్‌రోడ్డు ఏర్పాటుకు రూ.59 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. రూ.25 కోట్లతో యాచారం నుంచి మీరఖాన్‌పేట వరకు, నందివనపర్తి నుంచి మేడిపల్లి వరకు, రూ.40 కోట్లతో పెద్దంబర్‌పేట నుంచి కావడిపల్లి వరకు, రూ.7.80 కోట్లతో ఆగాపల్లి నుంచి తులేకలాన్ వరకు రూ.3.09 కోట్లతో డబుల్‌లేన్ల రోడ్ల విస్తరణ పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేష్, నీటి పారుదల శాఖ డీఈ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామ సమీపంలోని శ్రీ కల్కిదోనగుట్ట గోపాలస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు సందర్భంగా ఆలయంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, వేదపఠనం, సామూహిక సత్యానారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ఆలయ అర్చకులు కృష్ణమూర్తి, పట్టాభిరామశర్మ, స్థానికులు శ్రీనివాస్, శ్యాంసుందర్, నితిన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డ తాండాకు చెందిన కేస్లీ ఇటీవల మృతిచెందింది. కేస్లీ కుటుంబ సభ్యులను బుధవారం ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు పరామర్శించారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేలను మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లేశ్‌నాయక్, నాయకులు పత్యా, పాండు, లాల్య పాల్గొన్నారు.

‘షర్ఫుద్దీన్’ వేడుకలకు వేళాయె..

- మత సామరస్యానికి ప్రతీక.. పహాడీషరీఫ్ దర్గా
- 9నుంచి ఉర్సు ప్రారంభం
- అన్ని ఏర్పాట్లు చేసిన పురపాలక సంఘం



పహాడీషరీఫ్ దర్గా

పహాడీషరీఫ్: చారిత్రక నేపథ్యం కలిగిన పహాడీషరీఫ్ బాబా షర్ఫుద్దీన్ దర్గా 757వ ఉర్సు ఉత్సవాలకు ముస్తాబయింది. అన్ని వర్గాల ప్రజలతో నిత్యం కళకళలాడుతూ.. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఈ దర్గాలో ఏటా ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ దర్గాను దర్శించుకుంటే ఆయురారోగ్యాలతో పాటు.. అనుకున్న పనులు జరుగుతాయన్న విశ్వాసం ప్రజల్లో ఉంది. ఈ నమ్మకంతోనే ఇక్కడ ప్రజలు గ్యార్వీ షరీఫ్‌లు నిర్వహించడం ఆనవాయితిగా వస్తోంది. భక్తులు దర్గాలోని బాబా సమాధికి పూలు, ఛాదరే-గుల్-గలాఫే సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. ఈ నెల 9వ తేదీ (శుక్రవారం)నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాల సందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

9 నుంచి 15వ వరకు

ఈ నెల 9న రాత్రి దర్గాలో నిర్వహించే ఖసీదయే బుర్దాషరీఫ్‌తో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అదేరోజు రాత్రి 12 గంటలకు బాలాపూర్ గ్రామంలోని చిల్లా నుంచి వేలాది మంది భక్తుల కోలాహలం మధ్య గంధం ఊరేగింపు ప్రారంభిస్తారు. అక్కడి నుంచి కొత్తపేట, వెంకటాపూర్, షాహిన్‌నగర్, జల్‌పల్లి కమాన్ ప్రాంతం సమీపంలోని దర్గా శక్కర్ షా వలీ వద్ద ఫజర్ నమాజ్ నిర్వహిస్తారు. అక్కడి నుంచి 10న ఉదయం 8 గంటలకు దర్గాపైకి ఊరేగింపు వెళ్తుంది. ఆదే రాత్రి చార్మినార్ సమీపంలోని పంజెషా నుంచి నిజాం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యే గంధం ఊరేగింపు.. మార్గ మధ్యలో జంగమ్మెట్ చిల్లా వద్ద అన్నదానం అనంతరం కొనసాగింపుగా 11న ఉదయం పహాడీషరీఫ్ దర్గాకు చేరుకుంటుంది. 14న రాత్రి పహాడీషరీఫ్ ఠాణా నుంచి ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న అధికారి.. పోలీస్ సందల్‌లో భాగంగా పూలు, చాదర్ తలపై పెట్టుకొని ఊరేగింపుగా వచ్చి సమర్పిస్తారు. 15న నిర్వహించే ఉస్లీ షరీఫ్ (పూల మాలల సమర్పణ)తో ఉత్సవాలు ముగుస్తాయి.

బాలాపూర్ నుంచి గంధం..

757 ఏళ్ల క్రితం ఇరాక్‌కు చెందిన కుతుబ్-హుల్-అక్తాబ్ షహెన్‌షా-ఇ-దక్కన్ సుల్తాన్ ఆరిఫీన్ హజ్రత్ బాబా షర్ఫుద్దీన్ భారత్‌కు వచ్చి, పహాడీషరీఫ్‌లోని ఎత్తైన కొండపై దట్టమైన అడవి, క్రూర మృగాల సంచారం నడుమ ప్రార్థనలు ప్రారంభించారు. అలాంటి వాతావరణంతో బాబా ప్రార్థనలను చూసిన భక్తులు.. ఆయనను ఆరాధించడం మొదలుపెట్టినట్లు పురాణాలు చెబుతున్నాయి. దేశ పర్యటనలో భాగంగా బాబా మొదటిసారిగా బాలాపూర్‌లో విశ్రాంతి తీసుకొని అక్కడి నుంచి పహాడీషరీఫ్ కొండపైకి మకాం మార్చారు. ఇందులో భాగంగానే మొదటి గంధాన్ని బాలాపూర్ నుంచి తీస్తున్నారు.

ఆ మెట్లే ప్రత్యేక ఆకర్షణ

దర్గాకు 360 మెట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూర్వం హైదరాబాద్ మొదటి నిజాం మహబూబ్ అలీ బాద్‌షా బాబా దర్శించుకునేందుకు వచ్చిన సమయంలో సుమారు వెయ్యి అడుగుల ఎత్తులో ఉన్న ఈ దర్గాకు సరైన మార్గం లేదు. పైకి ఎక్కే సమయంలో బాద్‌షా కాలికి గాయమైంది. దీంతో రాజునైన తనకే గాయాలైతే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని భావించిన నిజాం.. ఈ దర్గాకు 360 మెట్లు, పక్కనే మసీదును నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. నాడు నిర్మించిన మెట్లు నేటికీ చెక్కు చెదరకుండా ఉండటం మరో విశేషం. ఇదిలా ఉండగా.. భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం రూ.16 కోట్ల వ్యయంతో 700 మీటర్ల పొడవు, 16 మీటర్ల ఎత్తు, 32 ఫీట్ల వెడల్పులో దర్గాపైకి ర్యాంప్ నిర్మాణ పనులు ప్రారంభించింది.

24 గంటలు బందోబస్తు



ఉత్సవాల సందర్భంగా రేయింబవళ్లు బందోబస్తు చేపట్టాం. ముఖ్యంగా శుక్రవారం రాత్రి ఊరేగింపు సందర్భంగా దారి పొడవునా ఆర్మ్‌డ్ ఫోర్స్, రోప్ పార్టీలతో ఉన్నతాధికారుల పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహిస్తాం. దర్గా నిర్వాహకులు కూడా వలంటీర్లను నియమించుకోవాలి. ఈ ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ సహకరించి, శాంతియుతంగా జరుపుకోవాలి. సాంప్రదాయంలో భాగంగా ఠాణా నుంచి గంధం ఊరేగింపు నిర్వహిస్తాం. దర్గాకి వచ్చే వారు పోలీసులకు సహకరించాలి.

– కిరణ్ కుమార్, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్

వైభవంగా నిర్వహిస్తాం



ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. బాబా మొదటిసారి బాలాపూర్‌కు వచ్చిన గుర్తుగా.. ఏటా ఛిల్లా నుంచి మొదలుకొని పహాడీషరీఫ్ వరకు గంధం తీసుకొని కాలినడకన ప్రజలు దర్గాలోకి ప్రవేశిస్తారు. బాబా ఆశీస్సులు పొందిన ఎంతో మంది విజయపథంలో కొనసాగుతున్నారు. ఇక్కడ జరిగే నిత్యాన్నదాన కార్యక్రమంపై ఆధారపడి వందలాది మంది యాచకులు కాలం వెల్లదీస్తూ తమ శేష జీవితాన్ని గడుపుతున్నారు. పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలి.

– సయ్యద్ ఫరీదుద్దీన్, దర్గా పర్యవేక్షకుడు

మానిటరింగ్ సెల్ ఏర్పాటు



మంత్రి సబితారెడ్డి ఆదేశాలతో మున్సిపాలిటీ తరపున అన్ని సౌకర్యాలు కల్పించాం. ప్రత్యేకంగా మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి హెల్త్, ఎలక్ట్రికల్, ఫైర్, పోలీస్, వాటర్‌వర్క్స్, ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేస్తూ ఆవరణలో మైక్ సదుపాయం కూడా ఏర్పాటు చేస్తున్నాం. పారిశుద్ధ్యం, నీటి సరఫరా సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. అదనపు విద్యుత్ సరఫరా అవసరమైతే మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా అందుబాటులో ఉంచుతాం. ఇప్పటికే ఏర్పాట్లను పర్యవేక్షించాం.

– ఎస్.వసంత, కమిషనర్, జల్‌పల్లి మున్సిపాలిటీ